క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ స్వప్న

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాలను అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీటీసీ స్వప్న అన్నారు. గురువారం న్యాల్‌కల్‌లోని ఎస్సీ కాలనీలో రూ.5లక్షలు జెడ్పీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, శివశంకరయ్యస్వామి, సత్యనారాయణ, బస్వరాజ్, ఇసాంపటేల్, ప్రభు, బసయ్యస్వామి, మక్సూద్‌మియా పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూసేకరణ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశం

మనూరు/నారాయఖేడ్ : నిజాంపేట్ నుంచి బీదర్ 161(బి)నేషనల్ హైవే రోడ్డు పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న ఖేడ్, పుల్‌కూర్తి, తదితర గ్రామాల రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారంపై అనుమానాలను నివృత్తి చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ మల్లేశం, ఆర్ఐలు తాజోద్దీన్, శంకర్‌రెడ్డి, శాంరావు, జూనియర్ అసిస్టెంట్ ఖాజామైనోద్దీన్, పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

జహీరాబాద్ టౌన్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) క్యాలెండర్‌ను జహీరాబాద్ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికే కానీ.. ప్రతిభకు అడ్డుకాదన్నారు. ప్రతిఒక్కరిలో ప్రతి భ దాగి ఉంటుందని, దాన్ని వెలికితీసి సమాజంలో గుర్తింపు పొందాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్పీఆర్డీ జహీరాబాద్ అధ్యక్షుడు కొనింటి నర్సింహులు, మొగుడంపల్లి అధ్యక్షుడు ఆశ్వాక్, మండల అధ్యక్షుడు శీతలగిరి శివరాజు, నాయకులు రాజు, సుభాష్, వాజీద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడండి

నారాయణఖేడ్: ప్రభుత్వ భూములు కాపాడాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీఓ వెంకటేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ ఖేడ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ అసైన్డ్ భూములు, చెరువు శిఖం భూములు, అటవీశాఖ, దేవాదాయ భూములపై రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు బాబురావు, మోషప్ప, కాన్షీరాం పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు బొల్లారంలో గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత, కౌన్సిలర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావటాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. వెంటనే బాల్కసుమన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు గోపాలమ్మ, చంద్రయ్య, నాయకులు జైపాల్ రెడ్డి, రమణయ్య, పరశురాం, వరప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

నివేదికల వివరణకే పరిమితం

- సమస్యలపై చర్చించని ప్రత్యేకాధికారులు
- మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం
- అధికారుల తీరుపై సభ్యుల అసహనం



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

కోహీర్(జహీరాబాద్): మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశానిన గురువారం మొక్కుబడిగా నిర్వహించారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన తరువాత నిర్వహించిన మొదటి సమావేశంలో ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించకపోవడం గమనార్హం. ఆబ్కారీ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ, వ్యవసాయం, వైద్య ఆరోగ్యం, పశువైద్యం, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ మొదలగు శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. కానీ.. ఏ ఒక్క సమస్యపై చర్చించలేదు. దీంతో ప్రత్యేకాధికారుల తీరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.

సభ్యులు లేవనెత్తిన సమస్యలు..

- కోహీర్ మండల పరిధిలోని చింతల్‌ఘాట్ గ్రామంలో ఏర్పాటు చేసేందుకు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ తీసుకువచ్చి 10నెలలు గడుస్తున్నా ఇంతవరకు గద్దెపై ఏర్పాటు చేయడంలేదని, దీంతో గ్రామానికి విద్యుత్ సరఫరా కావడం లేదని ఎంపీటీసీ మల్లన్నపాటిల్ వాపోయారు. దీంతో స్పందించిన విద్యుత్‌శాఖ ఏఈ మనీష్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడంలేదని, అందులో కాయిల్స్ లేవని సమాధానం చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మల్లన్నపాటిల్ తెలిపారు.
- మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామం మధ్యలో ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని, వెంటనే మరోచోటకు మార్చాలని ఎంపీటీసీ షెట్టినాయక్ అధికారులను కోరారు.
- గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ పొందడానికి అవసరమగు సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందజేయాలని ఏఈ మనీష్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
- పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో అనేకమంది పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీటీసీ మల్లన్నపాటిల్ తెలిపారు.
- కల్యాణలక్ష్మి చెక్కులు వచ్చి నెలరోజులు అవుతున్నా ఇంతవరకూ పంపిణీ చేయలేదని పలువురు సభ్యులు అధికారుల దృషికి తీసుకురాగా త్వరలోనే పంపిణీ చేస్తామని తహసీల్దార్ శాంతకుమారి తెలిపారు.
- కోహీర్ సాంఘీక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, సర్వే చేయకపోవడంతోనే నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని సంక్షేమ అధికారి వెంకటేశం వివరించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సూర్యారావు, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ రాందాస్, ఎంపీడీఓ సుజాతనాయక్, ఎంఈఓశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నిజాంపేట్ మండల కేంద్రంలో సీసీ రోడ్డు, అదనపు తరగతి గది నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాలు, తండాలకు కొత్త రోడ్లకు రూ.22 కోట్లు, అంగన్‌వాడీలకు పక్కా భవనాల కోసం రూ.3.20కోట్లతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. చెరువుల మరమ్మతులకు రూ.30కోట్లు ప్రతిపాదించినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.10కోట్లు మంజూరు కాగా జిల్లా గ్రాంట్స్ కింద రూ.15.06కోట్లకు గాను కలెక్టర్ ప్రొసిడింగ్స్ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సబితాలింగారెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలి



కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: నెల 15న నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ రోజు బంజారా ఉద్యోగులకు ఆన్ డ్యూటీ(ఓడీ) సౌకర్యం కల్పించాలని తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం(టీబెస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆ సంఘం నాయకులతో కలిసి ఏఓ పరమేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తులసీరాం రాథోడ్ మాట్లాడుతూ ఈ నెల 15న సేవాలాల్ మహారాజ్ జయంతిలో గిరిజనులతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొంటారని చెప్పారు. బంజారా ఉద్యోగులంతా జయంతిలో పాల్గొనేందుకు వీలుగా ఓడీ సౌకర్యం కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో టీబెస్ జిల్లా అధ్యక్షుడు మంజ్యానాయక్, ప్రధాన కార్యదర్శి అర్జున్‌చౌహాన్, గిరిజన సంక్షేమ సంఘం జహీరాబాద్ అధ్యక్షుడు రఘునాథ్ రాథోడ్, నాయకులు శ్రీనివాస్‌నాయక్ పవార్, వాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ ప్రభుత్వంపై కక్ష సాధింపు సరికాదు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, నాయకులు

సంగారెడ్డి అర్బన్: కేరళ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కేరళ ప్రభుత్వానికి సంఘీభావంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు, సమైక్య విధానానికి భిన్నంగా వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేరళ ప్రభుత్వం కార్మిక వర్గానికి, ప్రజలకు, రైతులకు అన్నివిధాల సౌకర్యాలు సంక్షేమాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించి 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని, ఈ కోడ్‌లను కేరళ ప్రభుత్వం అమలు చేయకుండా కార్మికవర్గానికి అండగా ఉంటోందని, అలాంటి ప్రభుత్వంపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తే కార్మికవర్గం సరైన గుణపాఠం చెబుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, కార్యదర్శి సాయిలు, నాయకులు యాదగిరి, ప్రవీణ్, రమేష్, ఆలీ, వేణుగోపాల్, సువర్ణ, శ్రీనివాస్, మల్లారెడ్డి, అధికసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సురేశ్ షెట్కార్



సీఎం రేవంత్‌రెడ్డితో సురేశ్‌షెట్కార్ తదితరులు

నారాయణఖేడ్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం ఆయన నివాసంలో మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన టికెట్‌ను డాక్టర్ సంజీవరెడ్డికి ఇచ్చి గెలుపునకు కృషి చేయగా.. షెట్కార్‌కు జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి పోటీకి అవకాశం కల్పిస్తామని ఆ పార్టీ అధిష్టానం హామీనిచ్చింది. ఈ నేపథ్యంలో రాజకీయాలకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిసింది. ఆయన వెంట మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు.

మహిళా చట్టాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న మమత

సంగారెడ్డి అర్బన్: మహిళా చట్టాలను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత అన్నారు. పట్టణంలోని రాయల్ జూనియర్ కళాశాలలో జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా అభ్యున్నతి కోసం ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని తెలిపారు. అనంతరం గర్ల్స్ సబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా వాణి, కోకన్వీనర్‌గా సాక్షి, కమిటీ సభ్యులుగా స్వప్న, మనీలా, వందన, మైత్రి, సౌమ్య, చాందిని, వైష్ణవి, మీనాక్షి, వర్షిని, వరలక్ష్మి, లక్ష్మి, భార్గవి, శోభారాణి మంజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్, జిల్లా నాయకులు రవి, కిరణ్‌గౌడ్, వివిధ కళాశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం



క్రీడాకారిణిని సన్మానిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని నేరడిగుంట గ్రామానికి చెందిన జెస్సిక చదువుతో పాటు ఆటల్లో రాణించడం పట్ల యువజన సంఘాల నాయకుడు శ్రీధర్‌రెడ్డి గురువారం ఘనంగా సత్కరించారు. రైతు కుటుంబంలో పుట్టి రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. జెస్సిక మెదక్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. బద్దంపల్లె, హన్మకొండ, సిరిసిల్ల, మేడ్చల్ జిల్లాలలో జరిగిన రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- ప్రత్యేక అధికారి ఎంఈఓ కృష్ణ
- కొనసాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు

వట్‌పల్లి(అందోల్): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతను అని కన్‌సాన్‌పల్లి గ్రామ ప్రత్యేక అధికారి, ఎంఈఓ బండి కృష్ణ అన్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి కృష్ణ మాట్లాడుతూ యువకులు, మహిళలు, గ్రామస్తులంతా కలిసి గ్రామ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామ కార్యదర్శి వీరయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, మహిపాల్ ముదిరాజ్, కృష్ణ, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వీరన్న, మాజీ ఎంపీటీసీ బాలయ్య, గ్రామపెద్దలు రమేష్, ప్రభాకర్ రెడ్డి, మాణయ్య, రమేష్, వనిశంకర్, ఈశ్వరయ్య, ప్రభు, దుర్గయ్య పాల్గొన్నారు.

గ్రామాలన్ని పరిశుభ్రంగా మారాలి

కంది(సంగారెడ్డి): గ్రామాలన్ని పరిశుభ్రంగా మారేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి సంధ్యారాణి అన్నారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం కంది మండల కేంద్రంలో శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్, బిల్ కలెక్టర్లు మల్లేశం, వీరరాజు, కిరణ్, సతీష్, ఐసీడీఎస్ అధికారి మమత, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఎం గురుపాదం, గ్రామస్తులు పాల్గొన్నారు.



కంది: పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

ఖమ్మంపల్లి గ్రామంలో..

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినందన్‌రావు, ఎంపీఓ అంజలిదేవి, మండల వ్యవసాయాధికారి శివకుమార్, ఆయా శాఖల అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

జిన్నారంలో మండలంలో...

జిన్నారం(పటాన్‌చెరు): ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా జిన్నారం, ఖాజీపల్లి గ్రామాల్లో ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రాములు ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయా కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



జిన్నారంలో...

సీఐ అనిల్‌కుమార్‌కు సన్మానం

జోగిపేట(అందోల్): జోగిపేట సీఐగా బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్‌ను కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, మున్నూరు కాపు సంఘం నాయకుడు ఆకుల నాగయ్య, గుర్రం కృష్ణ, ముదిరాజ్ సంఘం నాయకుడు రాములు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు యాదయ్య, మైనార్టీ నాయకులు అబ్బాస్‌అలీ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

సంగారెడ్డి అర్బన్: ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు గురువారం సంగారెడ్డి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ మాట్లాడుతూ అందరికీ సమాన విద్య, కామన్ స్కూల్ విధానం, బడుగు బలహీన వర్గాల దగ్గరికి విద్య, అంతరాలు లేని సమాన విద్య కోసం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల పరిశీలన

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూరు రోడ్డులో తిరిగి ప్రారంభమైన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను గురువారం తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి జయరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలల్లోనే రైతులు తమ పత్తిని విక్రయించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ డివిజన్‌కు నిధులు మంజూరు చేయండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరించేందుకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. 113 డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ, శాంతినగర్, గౌతంనగర్ కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని ఈ వ్యవస్థ పునరుద్ధరించేందుకు రూ.1.15 కోట్లు కేటాయించాలని కోరారు.

◆ తుది ఓటరు జాబితా విడుదల

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గం స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 తుది ఓటరు జాబితాను తహసీల్దార్ భాస్కర్ గురువారం విడుదల చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మొత్తం 4 ,07 419 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 2,09757, మహిళలు 1,97577, ట్రాన్స్‌జెండర్స్ 85 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ పాల్గొన్నారు.

◆ కుట్టు మిషన్ల అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం మాదారంలో నియోజెన్ కెమికల్స్ పరిశ్రమ యాజమాన్యం మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను గురువారం అందించారు. ప్రత్యేకాధికారి మల్లేశ్, పరిశ్రమ ఎండీ శ్యాంసుందర్, డైరెక్టర్ నరేష్, ప్లాంటు మేనేజర్ చందు, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ మహిళలకు కుట్టుమిషన్‌లను అందజేశారు. మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి, తగిన సర్టిఫికెట్లను అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రత్యేకాధికారి మల్లేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

◆ జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న ఉర్సే షరీఫ్ హజ్రత్ పీర్‌గైబ్ సాహెబ్ ఖిబ్లా జాతర వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు.బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు భాస్కర్, శివశంకరయ్యస్వామి, ప్రవీణ్‌కుమార్, బస్వరాజ్, సత్యనారాయణ, సతీష్ కుమార్, ఇసాంపటేల్, ఉత్సవ కమిటీ సభ్యులు యూనూస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

◆ నిధులు మంజూరు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహశబరీష్‌కు కార్పొరేటర్ పుష్పనగేష్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పట్టణంలోని శ్మశానవాటికలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

◆ ఈ నెల 15న సేవాలాల్ జయంతి

నారాయణఖేడ్: సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ విజ్ఞప్తి చేశారు. ఖేడ్‌లో గురువారం ఆ సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. నాయకులు లక్ష్మణ్‌చౌహాన్, రాజునాయక్, పూల్‌సింగ్, మోహన్ నాయక్, జైపాల్, హిరామన్, రమేష్, రవీందర్, కమల్, నెహ్రూ, దేవీసింగ్ పాల్గొన్నారు.

◆ పుస్తెమట్టెలు బహూకరణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన యువతికి గురువారం మన సమాజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తెమట్టెలు, చీరను అందజేశారు. కార్యక్రమంలో మన సమాజం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్ స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

◆ ఇద్దరిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: బఫర్ జోన్ ఆక్రమించి నిర్మాణాలు చేసిన ఇద్దరిపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పట్టణంలోని పెద్దచెరువు బఫర్ జోన్ సర్వేనెంబర్ 185లో ఉన్న చెరువు శిఖం ,బఫర్ జోన్ పరిధిలో బీవీ-ఇన్ఫ్ర ప్రతినిధి భానుప్రకాష్ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. మరోవైపు, ఎస్ఆర్ సంస్థ ప్రతినిధి సంజీవరెడ్డి ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

◆ సమ్మె కరపత్రం ఆవిష్కరణ

కొండాపూర్(సంగారెడ్డి): ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గొల్లపల్లి జయరాజు ఆధ్వర్యంలో మండల పరిధిలోని అనంతసాగర్‌లో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు అమృతమ్మ, రైతు సంఘం మండల నాయకులు రామచంద్రయ్య, నర్సింహులు, విజయరావు సత్తమ్మ, ఏసమ్మ పాల్గొన్నారు.